విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అల్లూరి ధైర్యం భావితరాలకు స్ఫూర్తి

- జిల్లా కలెక్టరు వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరా టం కోసం అలుపెరగని కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్యం, త్యాగనిరతి, నిరాడంబరత తరతరాలకు స్ఫూర్తిదాయక మని జిల్లా కలెక్టరు వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా మంగళవారం జూట్ మిల్ ఫ్లైఓవర్ దగ్గర ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి జిల్లా కలెక్టరు ప్రసన్న వెంకటేష్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాట పటిమ, చరిత్రను సింహావ లోకనం చేసుకోవడం మన కర్తవ్యం అన్నారు. త్యాగశీలత, దేశంపట్ల గౌరవం, ఐక్యత, సమగ్రతల స్ఫూర్తిని ఇటువంటి మహనీయుల నుంచి యువత అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, స్థానిక కార్పొరేటర్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ, ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలి

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటపటిమ, ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. మన్యం విప్లవవీరుడు అల్లూరి 126 వ జయంతి సందర్భంగా మంగళవారం తణుకు వీరనారా యణ థియేటర్ సెంటర్లో అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి సీపీఐ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసంద ర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ వలసపాలన అంతానికి దేశ స్వాతంత్ర్య సముపార్జనకు మొక్కవోని దీక్షతో ఎనలేని ధైర్యసాహసాలతో పోరాడి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని తదనంతరం దేశంలో పేదరికం, దారిద్ర్యం,దోపిడీ, అసమానతలు లేని స్వపరిపాలన కాంక్షతో 27 ఏళ్ళ వయస్సులోనే తన ప్రాణాలను బ్రిటిష్ తుపాకీ గుళ్ళకు అర్పించారన్నారు.అల్లూరి ఆశించిన సమాజ స్థాపనకు పూనుకోవడమే మనం అల్లూరికి అర్పించే నిజమైన నివాళి అంటూ భీమారావు పేర్కొన్నారు.సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, పార్టీ నాయకులు నామాన వెంకటే శ్వరరావు, గుబ్బల వెంకటేశ్వరరావు, బొద్దాని మురళి,నూనె రాధాకృష్ణ,మహేష్ తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర- ముసునూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి సంక్షేమపథకాలు అందజేస్తున్నారని నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు.మంగళవారం మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష పథకాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మత,వర్గ భేధాలు లేకుండా సంక్షేమపథకాలు గ్రామ ప్రజలకు అందించడం ఆంధ్రరాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. గతంలో ఏ పథకం కావాలన్న రాజకీయ నాయకుడు ఇంటికి పలుమార్లు తిరిగివిసుగుచెంది ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వుండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్,ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి తుమ్మల దంపతులు

విశాలాంధ్ర- ముసునూరు: తెలుగుదేశం పార్టీలోకి రావడం తమ సొంత ఇంటిలోకి వచ్చినంత ఆనందంగా వుందని నాగర్జునసాగర్ కాలువ వేంపాడు మేజరు డిసి ఛైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు దంపతులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేల్పుచర్లగ్రామానికి చెందిన మాజీ డిసి ఛైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు, భార్య మాజీ జెడ్పీటీసీ తుమ్మల అనిత వీరువురు తమ అనుచరులతో కలిసి బీజేపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి నూజివీడు నియోజక వర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టిన మేనిఫెస్టోకు ఆకర్షితులై ,టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర రైతులకు,మహిళలకు,యువతకు ఇస్తున్న పలు హామీలకు ఆకర్షితులై టిడిపి లోకి చేరినట్లు తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - లింగపాలెం : ఆశన్నగూడెంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష, భోగోలులో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదనే జగనన్న ఇటువంటి కార్యక్రమాలను పెట్టారని, ప్రజలు వీటిని సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్ర ంలో ఆశన్నగూడెం సర్పంచ్ పానుగంటి పద్మజ, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతారావు, రాష్ట్ర కార్మిక శాఖ వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల సచివాలయాల కన్వీనర్ అన్నపునేని శాంతారావుతోపాటు మండల స్థాయిలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

TANUKU MUNICIPALITY

Roc. No. 225/2023/E2 **Dt. 03.07.2023**

NOTICE INVITING EXPRESSION OF INTEREST

Expression of Interest is invited from the interesting consultancy service agencies for preparation of Detailed Project Report of Water Supply Improvement in Tanuku Municipality under AMRUT 2.0 Tranche-2.

The short listed firms will be invited to submit technical and financial bids.

Sales of Tender Schedule - 10.07.2023 to 11.07.2023
Submission of EOI on - 12.07.2023 up to 3.00 Pm
Opening of Technical Bid - 12.07.2023 at 4.00 Pm
Cost of Tender Schedule - Rs. 1,000/-

For further details please contact at office in working hours (Ph. 08819 224056 & 9849906557)

Sd/- **Commissioner,** Tanuku Municipality

-సిట్టింగుల్లో మథనం

-ప్రశాంత్ కిషోర్ సర్వే పైనే చర్చంతా

వైసీపీలో...ఐ ప్యాక్ గుబులు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: మాకే టిక్కెట్లు... మాకు తప్పించి మరొకరికి ఇవ్వరు... అని ఇంతకాలం భావిస్తూ వస్తున్న వైసిపి నేతలకు ఐ ప్యాక్ కలవరపాటుకు గురిచేస్తోంది. వైసీపీ రాజకీయ వ్యూహకర్తగా మారిన పీకే ఫేవర్ జిల్లా నేతలను రాబోయే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు వచ్చే తరుణంలో ప్రజాగ్రహానికి గురవుతున్న నేతల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతుండడం ప్రస్తుతం పార్టీలో ఎవరిని కదిలించినా ఐ ప్యాక్ సర్వే రానున్న ఎన్నికలలో టిక్కెట్లు తదితర అంశాలపైనే జోరుగా చర్చ సాగుతోంది.గెలుపు గుర్రాలకి ఎన్నికలలో టికెట్ అంటూ ముఖ్యమంత్రి తెలపడంతో ఆ పార్టీ నేతలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సిట్టింగులలో 27 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు గల్లంతేనని జరుగుతున్న ప్రచారంలో జిల్లాకు చెందిన సిట్టింగ్లలోనూ నలుగురు ఉన్నట్టు సమాచారం. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో పలు మార్పులు తథ్యమని పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో 175 సీట్లకు 175 గెలుపొందాలంటే ముఖ్యమంత్రి జగన్ పదేపదే చెపుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈసారి కూడా గత ఎన్నికలలో రచించిన వ్యూహాన్ని అమలు చేసేందుకు వైసిపి ప్రయత్నిస్తోంది. ఈసారి కూడా ఐ ప్యాక్ సర్వేతో పాటు పీకే సలహాలు, సూచనలు తీసుకుని రానున్న ఎన్నికలలో విజయం సాధించాలన్నది జగన్ ఎత్తుగడ. ఈ నేపథ్యంలో పీకే సర్వే జిల్లాలో పర్యటించి ప్రాథమికంగా కొంత సమాచారం సేకరించారని వినికిడి. ఇది అత్యంత గోప్యంగా నియోజకవర్గాలలో జరిపిన పర్యటన సందర్భంగా జిల్లాకు చెందిన కొన్ని నిజాలు వెలుగులోకి వచ్చాయని, ఎమ్మెల్యేలు ఎంపీలతో సంబంధం లేకుండా కార్యకర్తలు, నాయకుల్ని ఎంపిక చేసుకొని మాట్లాడుతున్నారని సమాచారం. మొదట గ్రూప్ చర్చలు, ఆ తర్వాత ఒక్కొక్కరితో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నారని తెలిసింది. ఈ నివేదికలను నేరుగా ముఖ్యమంత్రి జగన్‌కు మాత్రమే నివేదిస్తున్నారని సమాచారం. నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ ఇన్చార్జి పనితీరు, వ్యవహార శైలి ఎలా ఉందనే విషయం తదితర వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. సంక్షేమ పథకాల అమలు, వాటికి సంబంధించి సక్సెస్, ఫెయిల్యూర్సును అడిగి తెలుసుకుంటున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రాజకీయంగా ప్రభావితం అయిన కుటుంబాలు, ప్రస్తుతం ఆ కుటుంబ సభ్యులు ఏ పార్టీలో ఉన్నారు? ఇప్పుడు కూడా అదే ప్రజాదరణ కలిగి ఉన్నారా ? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారని భోగట్టా. ప్రస్తుత ఎమ్మెల్యే పై వ్యతిరేక అంశాలు, వాటికి కారణాలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం అభ్యర్థిని మార్చాల్సిన అవసరం ఏమైనా ఉందా? అని ప్రశ్నిస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారని స్వయంగా వైసిపి నాయకులే అంగీకరిస్తున్నారు. అందరితో కలిసి మాట్లాడినప్పుడు వ్యతిరేక అంశాలు చెప్పకపోయినా, ఒక్కొక్కరితో మాట్లాడే సందర్భంలో తమ మనసులో దాగి ఉన్న అక్కసు కొందరు వెళ్ళగక్కుతున్నారని తెలిసింది. వీరి అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుంటారా? అది ఎంతవరకు అనే చర్చ నడుస్తోంది. పీకే టీం తో భేటీ అంటే వైసీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలలో ఒకరకమైన వణుకు పుడుతుందని చెప్పక తప్పదు.

స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ కెరటం అల్లూరి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: భారతదేశ స్వాతంత్ర సంగ్రామంలో విప్లవ కెరటం అల్లూరి సీతారామరాజు అని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతా రామరాజు 125వ జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన్యం ప్రాంతంలోని అమాయకులైన గిరిజనులపై బ్రిటిష్ అధికారులు సాగిస్తున్న దురాగతాలు, దమనకాండను చూసి చలించి గిరిజనులలో ధైర్యాన్ని నింపి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటానికి దళాన్ని తయారుచేసి ఉన్న తక్కువ వనరులతోనే బలమైన బ్రిటిష్ సైన్యాన్ని ఎదిరించిన ధీశాలి అల్లూరి అని కొనియాడారు. నేటి పాలకులు మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు రగిలిస్తున్నారని అటువంటి మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని అదే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు.సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో విప్లవ భావాలను రేకెత్తించిన స్వాతంత్ర సమరయోధులు,ఈ దేశ యువతకు నిరంతర స్ఫూర్తి ప్రదాత అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య పోరాటం నేటికీ ఆదర్శనీయమని కొని యాడారు.ఆయన చూపిన మార్గంలో ప్రజా సమస్యలపై పోరాడి దేశంలోని అసమానతలను రూపుమాపడమే అల్లూరికి ఇచ్చే అసలైన ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు,సిపిఐ ఏలూరు ఏరియా సమితి సభ్యులు అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, గౌర్లి స్వాతి,బి. కే.ప్రసాద్,గేదెల నాగేశ్వరరావు, పోలా భాస్కరరావు,డీజే జగన్నాథం, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ చాకిరి సురేష్,రెడ్డి శ్రీనివాస డాంగే,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో: బ్రిటిష్ వారి దమన కాండను ఎదిరించడానికి మన్యంలో ఉన్న గిరిజనులకు విద్య నేర్పి స్ఫూర్తి రగిలించిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా తొర్లపాటి రాజు మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తితో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం సచివాలయాల్లో ఉన్న ఖాళీల భర్తీ కోసం యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు మానవతా అధ్యక్షులు పుల్లారి సోమశేఖర్, ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు, సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు, మానవతా సభ్యులు అప్పారావు, ఏఐవైఎఫ్ నాయకులు వడ్డే రామారావు, బొల్లవరపు విజయ శేఖర్, నక్క వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర- ఏలూరు: ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనుల పై అటవీ శాఖ అధికారుల వేధింపులు మానుకోవాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవి తల్లిని నమ్ముకుని ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను వేధింపులకు గురి చేస్తూ, భూములను దున్నడంతో అనేక నష్టాలు పాలై దురద జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని పలుమార్లు విజ్ఞాపన పత్రాలు అందజేశారన్నారు. ఐటీడీఏ వద్ద పలుమార్లు ఆందోళనలు, ముట్టడి కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. అనేకమార్లు గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వ జాప్యం కారణంగా పోడు భూముల పట్టాలు పంపిణీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల పట్టాల పంపిణీ తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై అటవీ శాఖ అధికారులు వేధింపులు మానుకోవాలన్నారు. లేనిపక్షంలో వేలాది మంది గిరిజనులు కలసి సిపిఐ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ అరియర్స్ చెల్లించాలి

విశాలాంధ్ర-ఏలూరు: నగర కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి పెండింగ్ అరియర్స్‌ను తక్షణమే ఇవ్వాలని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయుసి) నాయకులు నగర కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏఐటి యుసి నాయకులు కమిషనర్ ను కలిసి ఇంజనీరింగ్ విభాగంలోని కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి వేతనాలకు సంబంధించిన అరియర్స్ కొంత సొమ్ము గతంలో చెల్లించారని మిగిలిన బ్యాలెన్స్ సొమ్మును చెల్లించాలని కోరారు. నగరపాలక సంస్థలో విలీనమైన 7 పంచాయతీల ఉద్యోగ సిబ్బందికి బకాయి పడ్డ ఒక నెల జీతం ఇప్పించాలని కమిషనర్‌ను కోరారు. మరణించిన ఉద్యోగ సిబ్బంది వారసులకు సంబం ధించి కారుణ్య నియమకాలలో ఈ -1 గుమాస్తా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. కమిషనర్ జోక్యం చేసుకుని సంబంధిత సిబ్బంది, యూనియన్ నాయకులతో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ని కలిసిన వారిలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. నాగేశ్వరరావు, ఏ. అప్పలరాజు, కోశాధికారి బి నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్ఎంవి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: నేటి విద్యార్థిని విద్యార్థులు అంతా అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం .సీతారాం ప్రసాద్ అన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా భీమవరం రూరల్ మండలం తాడేరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాటలు పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం ప్రజలను చైతన్య పరచిదేశ స్వాతంత్రం కోసం అల్లూరి చేసిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్. సింహాద్రి రావు, ప్రజా నాట్యమండలి కళాకారుడు షేక్ చాన్ బాషా మాట్లాడుతూ సమాజంలో ప్రజలనుచైతన్య పరచడంలో అల్లూరి చేసిన కృషి మరువ రానిదని ఆయన ఒక వ్యక్తి కాదని గొప్ప శక్తిని కొనియాడారు. అనంతరం నిర్వహించిన పాటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి. స్వతంత్ర వీరుడు, స్కూలు స్థలదాత గంధం పెదబాబు, ఉపాధ్యాయులు మంగారావు, విజయ్, పరుశురాం నాయుడు, సుందరి ,మేరి రాజేశ్వరి, సునంద పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలి

విశాలాంధ్ర-పెంటపాడు: మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రతిరోజు రూ.600 వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు)జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం ప్రాంతంలో పెంటపాడు మండల ఉపాధి కూలీల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ 2005 ఉపాధి హామీ చట్టంలో అప్పటి ధరలను బట్టి నిర్ణయించడం జరిగిందని ప్రస్తుతం నిత్యావసర వస్తువుల, గ్యాస్ ధరలు, తదితర వస్తువుల ధరలు 100 శాతం పెరిగాయని పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల రోజువారి కూలీ రూ.600 చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఈ చట్టాన్ని పేద ప్రజలకు దూరం చేసే విధంగా రెండు పూటలా పని విధానం ప్రవేశపెట్టి పేదలకు అన్యాయం చేసే విధంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలపై భవిష్యత్తులో మరింత పోరాట ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశం అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పెంటపాడు మండల కమిటీ అధ్యక్షులుగా చింతాడి ఫ్రాన్సిస్, ఉపాధ్యక్షులుగాముదర బోయిన పోతురాజు, కార్యదర్శిగా దిద్దే నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా యుజ్జల ప్రకాష్, కోశాధికారిగా మొర్చ రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో మూలారి కిరణ్ కుమార్,యజ్జల పండు, వై ఏసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: అంగనవాడిలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంగన్ వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయుసి) ఆధ్వ ర్యంలో అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని నూజివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా చాట్ల పుల్లారావు మాట్లాడుతూ అంగన్వా డీల పై రాజకీయ నాయకులు వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వేధింపులకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. అంగన్వాడీలకు వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు వేతనం చెల్లించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్ కు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. పదోన్నతికి రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. 300 జనాభా దాటిన మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలు గా మార్చాలని,వర్కర్స్ తో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకుని,అదనంగా హెల్పర్ ను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రొంపిచర్ల క్రిస్టియనమ్మ ,యూనియన్ అధ్యక్షులు ఎం. విజయలక్ష్మి,, సహాయ కార్యదర్శి సిహెచ్ విజయదుర్గ, విమల, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

విశాలాంధ్ర-తణుకు: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చేశామని పౌరసరఫరాల, వినియోగ దారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళ వారం తణుకు పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ బాలుర హైస్కూల్ లో విద్యార్థినీ, విద్యార్థుల తల్లుల ఖాతాల్లో "జగనన్న అమ్మఒడి" పథకం ద్వారా నగదు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందచేస్తున్న ఈ పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. కార్పొరేటు స్కూల్స్ కూడా ప్రభుత్వ బడులతో పోటీపడేలా మన విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దు తున్నామన్నారు. జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ కృషి, పట్టుదలతో అడుగులు వేసి చరిత్ర పుటల్లో ఒక పేజీ మనది ఉండేలా పోటీపడాలన్నారు. నాల్గవ విడత అమ్మఒడి తణుకు పురపాలక సంఘం పరిధి, తణుకు మండలం వివిధ పాఠశాలల 10,906 మంది తల్లులకు రూ. 14 కోట్ల17 లక్షల78వేల నమూనా చెక్కును మంత్రి కారుమూరి, జిల్లా కలెక్టరు ప్రశాంతి అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

6న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఏఐవైఎఫ్ ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయ వంతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కన్వీనర్ చాకిరి సురేష్, కో కన్వీనర్ తొర్లపాటి రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏఐవైఎఫ్ ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్, రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన వాగ్దానం మేరకు జాబ్ క్యాలెండర్ తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1,2 పోస్టులు భర్తీ చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐ, కానిస్టేబుల్ వ్రాత పరీక్షలలో అర్హత పొందిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలన్నారు. ఆర్.బి.కె కేంద్రాలలో ఉన్న పశుసంవర్ధక సహాయకుల ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ అందజేసి శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల నియామకం చేసేవరకు ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి నెలకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ రామారావు, ప్రసన్న కుమార్ , అవినాష్ , తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -భీమవరం: న్యాయ వాదుల అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎఎల్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో మంగళవారం భీమవరం జిల్లా కోర్టు సముదాయంలో న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, న్యాయవాదుల సంక్షేమ నిధికి వంద కోట్లు కేటాయించాలని, లా నేస్తం పథకం ప్రతి నెల ఇవ్వాలని, మృతి చెందిన న్యాయ వాదులకు ఎక్స్‌గ్రేషియో 10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమణారావు కార్యదర్శి పాకా రమేష్, ఐఎఎల్ కార్యదర్శి వై.న్యూటన్, కాస్ట్రో, వై.వి.ఆనంద్ బి.అశోక్ రాఘవేంద్ర, ఎం.శ్రీనివాస్ వి.బాబ్జీ, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపురంలో : న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఎల్ రాష్ట్ర నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో న్యాయవాద సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోర్టు ముందు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో పాల్గొన్న క్రాంతి కుమార్ మాట్లాడుతూ న్యాయవాద రక్షణ చట్టం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 35 సంవత్సరాలు దాటిన న్యాయవాదులకు సంక్షేమ నిధికి నగదు జమ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన న్యాయవాదులకు రూ.10 లక్షలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, పట్టణ ఉపాధ్యక్షులు కానూరు బజ్జి, పోలిశెట్టి బాబ్జి, చేగొండి బాలాజీ, కొక్కిరిగడ్డ అమరేశ్వర్, కొత్తపల్లి రమేష్, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్‌లో : అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ ఏ ఎల్) రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం నూజివీడు కోర్టుల వద్ద న్యాయవాదులు ప్లె కార్డులతో నిరసన తెలి పారు. అనంతరం న్యాయ వాదులు మాట్లాడుతూ ప్రతినెల లా నేస్తం విడుదల చేయాలన్నారు. పరిరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, న్యాయవాదుల వెల్ఫేర్ గ్రాండ్ కు ఇవ్వవలసిన రూ.10 లక్షల నిధులను విడుదల చేయాలన్నారు. ఇంటి స్థలం మంజూరు చేయాలని, చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు ఇవ్వాల్సిన మంచి నీరు, పార్కింగ్, క్యాంటీన్ తదిత సదుపాయాలు కల్పించాలన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, 35 ఏళ్ల న్యాయవాదులకు కూడా వెల్ఫేర్ ఫండ్ సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

తణుకులో : 35 సంవత్సరాలు నిండిన న్యాయవాదులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని ఐ ఎ ఎల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏలూరు అశోక్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు జగిలంక శివ డిమాండ్ చేశారు.ఐఏఎల్ భారత న్యాయవాదులు సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మంగళవారం కోర్టులో న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ జూనియర్ న్యాయ వాదులకు లా నేస్తం ప్రతి నెల ఇవ్వాలని,వెల్ఫేర్ ఫండ్ రూ.5లక్షల నుండి 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. మరణించిన న్యాయ వాదులకు రూ.10 లక్షలు మంజూరు చేయాలని,న్యాయ వాదులకు ఇల్లు స్థలాలూ గృహాలు నిర్మించి ఇవ్వాలని,అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు సువర్ణ, జనసేన నాయకులు అడ్వకేట్ పిప్పర రవి,విజయ్, పవన్, భవాని,జ్యోతి, సీనియర్ న్యాయవాదులు జంగం వెంకటేశ్వర రావు,షేక్ బాజి, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన పథకం జగనన్న సురక్ష

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ప్రజల సమస్యల పరిష్కారానికి, నవరత్న పథకాలను అమలు చేయడంతో పాటు, ఎంతో అద్భుతమైన పథక మైన జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న సురక్ష పథకం లో భాగంగా మంగళవారం భీమవరం మండలంలో చిన అమిరం, భీమవరం పట్టణంలోని 15 వ వార్డు, రెండో వార్డు, వీరవాసరం మండలంలోని మడుగు పోలవరం గ్రామాల్లో జరిగిన సురక్ష సభలలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల చదువులకు సంబంధించి ముందుగానే అన్ని సర్టిఫికెట్లను కూడా సిద్ధం చేసుకునే విధంగా జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ ఈనెల 28వ తేదీ వరకు అమలు చేస్తున్నారని అన్నారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లను ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్,అధికారులు, ప్రజాప్రతినిధులు, పిల్లల తల్లిదండ్రులు, పార్టీ నాయకులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు పంపిణీ

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని కోయిదా పంచాయతీలో మంగళవారం మొదలైన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ వాళ్ళ కాంత అధ్యక్షతన ఏర్పాటైన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ రాణి, ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, జడ్పిటిసి గుజ్జా రామలక్ష్మి ఆ గ్రామంలో దరఖాస్తు చేసుకున్న సభ్యులకు 640 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోయిదా వైద్యాధికారి మాధురి, వైసీపీ మండల కన్వీనర్ కేశగాని శ్రీనివాస్ గౌడ్, కామినేని వెంకటేశ్వరరావు, వివిధ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - అంబాజీపేట : వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలను అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు. వంగవీటి మోహన రంగా 76వ జయంతి కార్యక్రమం మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న వంగవీటి మోహన్ రంగా విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకలలో ముందుగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెదేపా, జనసేన పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ప్రజా పోరాటాలు చేసిన వంగవీటి రంగాను ఆదర్శంగా తీసుకుని నేటి యువత పనిచేయాలని అన్నారు. వంగవీటి మోహన రంగా అనే వ్యక్తి ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందిన వ్యక్తి కారని, ఆయన ఒక శక్తి అన్నారు. పేదలకు అండగా నిలిచేతత్వమే ఆయనకు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, పత్తి దత్తుడు, సుదాబత్తుల రాము, రవణం రాము, కొర్లపాటి గోపి, అప్పన శ్రీను, మంచాల నోకేష్, అరిగెల శివ కళ్యాణ్, ముఠామేస్త్రి, రామ్మూర్తి, అధిక సంఖ్యలో కాపు యువత పాల్గొన్నారు.

బలహీన వర్గాల కోసం ప్రాణత్యాగం చేసిన రంగా

విశాలాంధ్ర-ఆకివీడు: బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడి ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి వంగవీటి మోహన్ రంగ అని మాజీ ఏఎంసీ చైర్మన్ మోటుపల్లి గంగాధర్, ఆకివీడు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం మోహన్ రంగా జయంతి సందర్భంగా ఆకివీడు మాదివాడ సెంటర్లో గల రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ కులాలకతీతంగా రంగస్ఫూర్తితో ఆకివీడు రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు కౌన్సి లర్ నిమ్మల నాగు, పుప్పాల గంగాధర్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని. వేసవికాలంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి సుమారు 100 రోజులు ప్రజల దాహార్తిని తీర్చే కార్యక్రమం, పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాలు చేయడం, మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు తలపెట్టి ఆ సేవా కార్యక్రమాల్లో యువతను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ నాయకులు అంబటి రమేష్, చుండూరి వెంకట్రావు, మండల గౌడ సంఘం అధ్యక్షులు కౌన్సిలర్ కట్టా రవి, డివి రమణమూర్తి, కుంకట్ల సత్యనారాయణ, అలీ, జక్కి అహ్మద్, గుండాబత్తుల దుర్గారావు, పుప్పాల బన్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-ఆకివీడు: విద్యార్థులకు అండదండగా అమ్మ ఒడి అనే కార్యక్రమంతో ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల తల్లులకు విద్య కోసం ఆసరా నిలిచారని డిసిసిబి చైర్మన్, ఉండి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. మంగళవారం చినకాపవరం జడ్పీ హైస్కూల్ నందు జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాలు పరిధికి సంబంధించిన 5774 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.7 కోట్ల 50 లక్షల 62 వేలు జగనన్న అమ్మ ఒడి కింద జమనున్నట్లు తెలిపారు. అనంతరం చినకాపురం గ్రామంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసి ఎండగండి శీను, ఎంపీపీ కటారి జయలక్ష్మి, సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి అన్నవరం, రూరల్ బ్యాంక్ చైర్మన్ కేశిరెడ్డి మురళి, నంద్యాల సీతారామయ్య, పుప్పాల సత్యనారాయణ, చిక్కాల చిన్న, మోర జ్యోతి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం

విశాలాంధ్ర-భీమడోలు: స్వామి వివేకానంద బోధనలు యువతకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం భీమడోలు శివాలయం సెంటర్ వివేకానంద విగ్రహం వద్ద స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమం వివేకానంద యూత్ అధ్యక్షులు సుతాపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం అధ్యక్షులు పాము మాన్ సింగ్, భీమడోలు డైమండ్ లయన్స్ క్లబ్ పూర్వఅధ్యక్షులు తుమ్మల ఉమామహేశ్వరరావు,వైసీపీ నేత రామకుర్తి నాగేశ్వరరావు, ఈడే సత్యనారాయణ, భీమడోలు సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, బెల్లంకొండ వెంకటేష్, బొమ్ము మణికంఠ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో రంగా జయంతి

విశాలాంధ్ర-భీమడోలు: పేద,బడుగు వర్గాల సంక్షేమానికి పేదల అభ్యున్నతికి కృషిచేసిన వంగవీటి మోహనరంగ ధన్యజీవి అని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం భీమడోలు సంతమార్కెట్ సెంటర్ వద్దనున్న వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహం వద్ద ఆయన 76వ జయంతి సందర్భంగా భీమడోలు కాపుయువత నిర్వహించిన జయంతి కార్యక్రమాలలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొన్నారు. తొలుత రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి స్వయంగా వడ్డన చేసారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సత్యనారాయణ, రావిపాటి సత్యశ్రీనివాస రావు,ఏఎంసి ఛైర్ పర్సన్ ఇంజేటి నీలిమాజూనియర్, ప్రత్తి మదన్, మద్దుల రాజా, రామకుర్తి నాగేశ్వరరావు, ముప్పిరిశెట్టి రాజేష్, సుబ్రహ్మణ్యం, శివరాం, మంచెం నాగు, యర్రంశెట్టి వాసు, ఏడుకొండలు, రామానుజం రవి, దుద్దెపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమడోలు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు పుప్పాల వాసు బాబు తెలిపారు. మండల స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఆగడాల లంకలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాసు బాబు ధ్రువీకరణ పత్రాలను అర్హులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చేందుకు జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పీడి విజయరాజు, ఎంపీపీ కనుమాల రామయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రంగా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-టి నరసాపురం: వంగవీటి మోహన్ రంగా 76వ జయంతి వేడుకలు మండల కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగానిర్వహించారు. మద్యాహ్నపు వారి గూడెం, రుద్ర కోట రాజు గూడెం,మక్కినవారిగూడెం గ్రామాలలో కేక్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా సేవలు చిరస్మరణీయమని తెలిపారు. పలువురు రంగా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాధనాల నరసింహ రావు, నోముల సత్యనారాయణ,తమ్మిశెట్టి బ్రహ్మయ్య,నోముల రెడ్డియ్య,మేకల నారాయణరావు, యామా రామారావు, జెసిబి శ్రీను,నోముల నరసింహ రావు, గణేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి మృతి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన జుజ్జూరి నాగేశ్వరావు (67) ప్రమాదవ శాత్తు చెరువులో పడి మంగళవారం మృతి చెందారు. ప్రతి రోజు లాగానే మృతుడు నాగేశ్వరరావు మంగళవారం ఉదయం కూడా గ్రామస్థులతో కలిసి ఉపాధి పనికి వెళ్ళారు. కొంతసేపు పని చేసిన తరువాత బహిర్భూమి కోసం గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రక్కనే ఉన్న కొంగల చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు.ఉపాధి కూలీలంతా నాగేశ్వర రావు ఇంటికి వెళ్లిపోయాడని అనుకుని పని ముగించుకుని వెళ్ళిపోయారు.సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.దీంతో లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.మృతుడు నాగేశ్వర రావు కు భార్య చనిపోగా ఇద్దరు కూతుళ్లకు వివాహాలు జరిపించారు.

ప్రతిభలో పోటీపడాలి

- జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ

విశాలాంధ్ర -పెదపాడు : 'జగనన్న ఆణి ముత్యాలు' అవార్డు సాధించడంలో ప్రతీ విద్యార్ధీ పోటీ పడాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళ వారం సందర్శించి అక్కడి విద్యార్థినులతో వారి విద్యా ప్రగతిని గురించి పద్మశ్రీ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ పేదరికాన్ని పారద్రోలేది విద్య మాత్రమేనని, నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపుదిద్దుతున్నా రన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యా ప్రమాణాల స్థాయి పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభ కనపరచిన విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ద్వారా నగదు బహుమతిని అందించి, సత్కరిస్తున్నామన్నారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.కార్యక్రమంలో వైసిపి బి.సి. సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, తహసీల్దార్ విజయకుమార్ రాజు, ఎంపిడిఓ ఎస్. నిర్మల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు అక్కి నేని రాజశేఖర్, మండలాధ్యక్షురాలు బత్తుల రత్నకుమారి, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ళ సతీష్ చౌదరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు అప్పన్న ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ గోపి, ప్రభృతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడులో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామ రాజు 126 జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు అల్లూరి సీతారామ రాజు ధైర్య సాహసాలు గురించి తెలియ జేసి విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు.అనంతరం క్షత్రియ సేవా సమితి, పి ఎం పి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్య క్రమం లో గ్రామ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గాదిరాజు బాలు, ఎంపీటీసీ సభ్యులు జంపన పద్మావతి, రమేష్ రాజు, కలిదిండి కుమార్ రాజు, వేగిరాజు విజయ రాజు,వేగేశ్న సూర్య రాజు ,వేగేశ్న గాంధీ రాజు,చిన్నం సిల్వేస్ట్ రాజు,జూలూరి నీలం,సముద్రపు సత్తి పండు, సొసైటీ కార్య దర్శి ఐ రామ కృష్ణ రాజు,గ్రామ కార్య దర్శి ఆర్. డి రామారావు, పి ఎం పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏ ఆర్ కె పరమేశ్వరులు, వీఆర్వో చంద్ర శేఖర్, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, తదితరులు రవితేజ,యం రవి కుమార్ తెలియ జేశారు.

అల్లూరికి భారతరత్న ఇవ్వాలి

విశాలాంధ్ర - గణపవరం: మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజుకు భారతరత్న కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అఖిలభారత హ్యాండ్లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నంద్యాల రామ లింగరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత గణపవరం మారెమ్మ అమ్మవారి గుడి వద్ద ఉన్న అల్లూరు విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు కొయ్యల వెంకట సుబ్బారావు, ఆధపరెడ్డి నాగ సీతయ్య, పలివెల వెంకట శ్రీనివాస్, పేరిచర్ల రామరాజు, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో 11 రకాల ఉచిత సర్టిఫికెట్లు అందజేస్తోందని, ఈ అవకాశాన్ని అర్హత కలిగిన వారందరూ వినియోగించుకోవాలని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. మంగళవారం గణపవరం,సరిపల్లి గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన 'జగనన్న సురక్ష'కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచ్ మూరా అలంకారం, సరిపల్లె సర్పంచ్ చనుమూరి లక్ష్మీ భవాని, ఎంపిపి దండు వెంకటరామరాజు, జడ్పిటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, మండల వైఎస్ఆర్ పార్టీ కన్వీనర్ దండు రాము, తహసిల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీవో గద్దల జ్యోతిర్మయి, చనుమూరి శివ, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -చాట్రాయి: ప్రతిఒక్కరి సమస్యను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చనుబండ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలపరిషత్ అభివృద్ధి అధికారి కే.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సామాన్యుల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలను అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. తహసీల్దార్ సిహెచ్ విశ్వనాథరావు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే నెలలు తరబడి కార్యాలయాలు చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగే వాళ్ళమని గుర్తు చేశారు.

సాంకేతిక సమస్యలు పరిష్కరించండి : పోలవరం పిఎస్సిఎస్ చైర్పర్సన్ చెలికాని బాబ్జి మాట్లాడుతూ సాంకేతిక సమస్యల వలన హౌస్ హెహెల్డ్ మ్యాపింగ్‌లో వున్న తేడాలు వలన ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులందరూ చొరవ తీసుకొని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సభలో చనుబండ పంచాయతీ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఎంపిటీసి సోనీ ఆనంద్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు జల్లెపల్లి పరమేశ్వర రావు, వనమా వాసు, వంకినీ వేంకటేశ్వరరావు, చీపురు గూడెం ఎంపిటీసి మోరంపూడి రాణి, చింతా శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

విశాలాంధ్ర-పాలకొల్లు: మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలోని గుబాలగుంట ప్రాంతం నుండి దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి, 8వ తరగతి చదువుతున్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు జుత్తిగ శ్రావణి, బాలం భువనేశ్వరి, దూరం వల్ల బడికి రావడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ దృష్టికి వచ్చింది. విషయాన్ని తన వద్ద చదువుకుని ప్రస్తుతం అమెరికాలో నివాసం ఉంటున్న సుస్మిత జనపరెడ్డి (పాలకొల్లు కు చెందిన దివంగత వల్లభు రవి కుమార్తె) కి తెలపడంతో, మానవతా దృక్పథంతో ఆమె వెంటనే స్పందించి వారిద్దరికీ రూ.13 వేలతో 2 సైకిళ్ళను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిని ప్రధానోపాధ్యాయుడు కోట శ్రీనివాస్, ఉపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్ చేతుల మీదుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో వాటిని అందించారు. దాత సుస్మిత ఇంటర్నెట్ ద్వారా మాట్లాడుతూ విద్యార్థులు అందరూ శ్రద్ధగా చదివి పురోగమించాలని కోరారు.

అల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

- జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: భారత స్వాతంత్రం కోసం అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, అడిషనల్ ఎస్ పి ఎ.వి సుబ్బరాజు, తదితరులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో వెన్నుచూపని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సిద్దిస్తుందని నమ్మి దాని కోరికే తన ప్రాణాలను అర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు అన్నారు.నేటి సమాజం వారి పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, అడిషనల్ ఎస్ పి ఎ.వి సుబ్బరాజు, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి జి వి ఆర్ కె ఎస్ ఎస్ గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, డీఎస్ పి బి.శ్రీనాద్, కలెక్టరేట్ లోని వివిధ కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: భారత స్వాతంత్ర్య పోరాటానికి అల్లూరి సీతారామరాజు ఒక మార్గ దర్శిగా నిలిచారని డి ఆర్ ఓ ఏ.వి.ఎస్.ఎస్ మూర్తి తెలిపారు. అల్లూరి సీతారామ రాజు జయంతిని మంగళ వారం కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి డి.ఆర్.ఓ,అధికారులు నివాళులర్పించారు. డి ఆర్ ఓ ఏ.వి.ఎస్.ఎస్ మూర్తి మాట్లాడుతూ అతి పిన్న వయసు లోనే దేశం కోసం త్యాగం చేసి స్వతంత్ర స్ఫూర్తిని రగిల్చిన వ్యక్తిగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఇలాంటి వీరుల గాధలను భావి తరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. అల్లూరి సీతారామరాజులోని నాయకత్వ లక్షణాలను, వారి త్యాగ స్ఫూర్తిని ,దేశ భక్తిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. యువత నిస్వార్ధంగా ఆలోచించి దేశ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడి పుష్పలత కలెక్టరేట్ ఏఓ రమాదేవి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు

విశాలాంధ్ర -కైకలూరు : కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు కైకలూరు మండలం భుజాబల పట్నంలో విప్లవ జ్యోతి, మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భముగా విగ్రహమునకు పూల మాల వేసి నివాళులర్పిస్తూ నియోజకవర్గ ప్రజలకు అల్లూరి సీతారామరాజు జయంతి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమములో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన, జడ్పిటీసి కూరెళ్ల బేబీ, మండల వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు దండే పుష్పలత, వాసవి రవిరాజు,ఉప సర్పంచ్ జంగం మోషే,గురజాల వేణు, మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర్, దండే రవిప్రకాష్, పండు రాము,ముదునూరి నాగరాజు, పెన్మెత్స సుబ్బరాజు, వేగ్నేశ రవి రాజు, రాంమూర్తి రాజు, కొబ్బరికాయల రాజు,పరగర్ల సుబ్రహ్మణ్యం, తోట నాగరాజు, ఇందుకూరి రాంబాబు,అల్లూరి సాయి, అల్లూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో: మండల కేంద్రం చాగల్లు శాఖ గ్రంథాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో సీతారామరాజు పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చదువరులు తదితరులు పాల్గొన్నారు

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ కార్యకర్తలు పిలుపునిచ్చారు. అల్లూరి 126వ జయంతి పురస్కరించుకుని స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆర్గనైజేషన్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కందుల కృపాప్రసాద్, కాకర అర్జున్, గుమ్మడిరాజు, లోపింటి చిన్న, కొంతం రాజు, గునాపు సాయి, పందిరి సుబ్బారావు, ఇందుగబల్లి వంశీ, భిన్నం శివ, కందుల వరలక్ష్మి, గునాపు వరాలమ్మ, పిల్లకాంతం తదితరులున్నారు.

రాజమహేంద్రవరంలో : స్థానిక రాజమండ్రి రామాలయం జంక్షన్ లో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల్లో రుడా చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు , భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహెూజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో తాట్ల బుచ్చి వెంకటపతి రాజు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బైరాజు ప్రసాద్ రాజు, మంతెన సీతారామరాజు, డాక్టర్ భాస్కర్ రాజు, విజన్ రాజు, ఇందుకూరి రామరాజు, మంతెన రమా గారు, దాట్ల శ్రీధర్ వర్మ వాళ్ళ బ్రదర్స్, చండి ప్రియా వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కియా సెల్టోస్ భారతదేశంలో ఆరంభం

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రముఖ ప్రీమియం కారు తయారీదారు కియా ప్రీమియం ఆర్ వీ శ్రేణిని అత్యంత అంచనా వేయబడిన తమ కొత్త ఆవిష్కరణ కొత్త సెల్టోస్ తో అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉంది. ఎల్లప్పుడూ ప్రయాణించే ఆధునిక కస్టమర్స్ కోసం రూపొందించబడిన, కొత్త సెల్టోస్ శక్తి నిండిన, స్మార్ట్ మరియు సురక్షితమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది, అద్భుతమైన ఎక్స్ టీరియర్స్ మరియు కొత్త ఇంటీరియర్స్ తో మెరుగ్గా తయారైంది. అంతర్జాతీయంగా అమ్ముడవుతున్న ప్రతి 10 కియా కార్లలో 1 సెల్టోస్ ఉండి కియా కార్పొరేషన్ కోసం అతి పెద్ద బ్రాండ్స్ లో ఒకటిగా సెల్టోస్ ఉంది. కొత్త సెల్టోస్ శ్రేణిలో ఉత్తమమైన ఫీచర్స్ మరియు అద్భుతమైన డిజైన్ తో పునః కనుగొనబడటం మరియు ఆధునికీకరణ ద్వారా మిడ్-ఎస్ యూవీ శ్రేణిలో వృద్ధి చెందుతుంది. సెల్టోస్ బ్రాండ్ మొత్తం సేల్స్ లో కియా ఇండియాకు ప్రస్తుతం 55% అందచేస్తోంది. ఈ విజయం పై రూపొంది, కియా ఇండియా కూడా ఒక కొత్త పరివర్తనా ప్రయాణం - కియా 2.0 ని ఆరంభించింది. కియా 2.0 ద్వారా, కంపెనీ 10% మార్కెట్ వాటా సంపాదించడం , ఇప్పటికే ఉన్న 300o నుండి 600o టచ్ పాయింట్స్ రెట్టింపు చేయడం మరియు కొత్త నవీన ఉత్పత్తులతో ఆర్ వీ నాయకత్వం పెంచడం వంటి గొప్ప లక్ష్యాలు ఏర్పర్చింది. ఈ చొరవలు విస్తరణ, సంతృప్తి మరియు మార్కెట్ నాయకత్వానికి కియా వారి నిబద్ధతను చూపించాయి.

7సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనుడు రోశయ్య

విశాలాంధ్ర - రాజానగరం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా ఏడుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించిన ఘనుడు కొణిజేటి రోశయ్య అని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు మండ వల్లి వెంకన్న బాబు, ఆర్యవైశ్య సంఘం రాజానగరం గ్రామ అధ్యక్షులు సముద్రాల రాంబాబు అన్నారు.దివంగత గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించు కుని మండల కేంద్రమైన రాజానగరంలో జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గ్రంధి నానబ్బులు,సభ్యులు మండా రాంబాబు,తొంటెపు చిన్నబాబు ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : అల్లూరి సీతారామరాజు వంటి మహనీయులను యువత ప్రతిఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు.భారత దేశ స్వాతంత్ర్య సాయుధ పోరాటం ఉద్యమాకారులైన అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో అల్లూరి 126వ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.దీనిలో భాగంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన రాజానగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి రామన్న దొర మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి తనకోసం కాకుండా పేద ప్రజల కోసం తను ఎన్నో కష్టాలు అనుభవించి పోరాటాలు చేసిన వ్యక్తి అల్లూరి అని కొనియాడారు.

మట్టి దోపిడీ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

విశాలాంధ్ర - సీతానగరం: మట్టి దోపిడీ పై ఇరిగేషన్ శాఖ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది అని టీడీపీ బిసి నాయకుడు బర్ల బాబురావు అన్నారు. ఈ సందర్భంగా బాబురావు విలేకరులతో మాట్లాడుతూ చీపురుపల్లి గ్రామంలో గల చవాకులు వారి చెరువులో అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా స్థానిక నాయకులు మట్టి తరలిస్తున్నారని స్పందనలో ఫిర్యాదు చేయగా సదరు రాజమహేంద్రవరం సబ్ డివిజన్ ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు వద్దకు వచ్చి పరిశీలించి మట్టి తరలించుకు పోవడం వాస్తవమేనని నిర్ధారించుకుని మట్టి తరలించుకు పోయిన వారి పై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రామాలలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో జగనన్న సురక్ష పథకం సర్పంచి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామాలలో నెలరోజులపాటు అర్హులైన ప్రతిఒక్కరికి లబ్ధిచేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ జి. జనార్ధన్, ఏఎంసి వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు కాకులపాటి లలిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా 76వ జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : విజయవాడ మాజీ ఎమ్మెల్యే, కీ.శే. వంగవీటి మోహన రంగా 76వ జయంతి సందర్భంగా స్థానిక కాకినాడ శారదా దేవి గుడి వద్ద రంగా జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు టిడిపి యువనేత మహాసేన రాజేష్ కాకినాడ రూరల్ టిడిపి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు పాల్గొని రంగా కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా గొప్ప ఉద్యమ నాయకుడని, నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొండబాబు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పేరా బత్తుల రాజశేఖర్, పెంకె శ్రీనివాస్ బాబా,రంగ మిత్ర మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష పథకం ద్వారా అభివృద్ధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపిపి తోట రవి, తోట గాంధీ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఉప సర్పంచ్ పాఠంశెట్టి కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలి

విశాలాంధ్ర - శంఖవరం : అన్ని ఎన్నికల కేంద్రాల్లోనూ తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని ఓటర్ల జాబితా పర్యవేక్షకులు ఎస్వీఎస్ సుబ్బలక్ష్మి కోరారు. శంఖవరం మండలంలోని కత్తిపూడిలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి బూత్ లెవెల్ అధికారి తప్పనిసరిగా తన పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటర్ల జాబితాలో పేర్లు సక్రమంగా ఉండటంకుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ కిందకి వస్తున్నారా లేదా వలస వెళ్లిన ఓటర్లు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. అదేవిధంగా చనిపోయిన ఓటర్లను పరిశీలించి ఎటువంటి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచనలు చేసినారు. కొత్త ఓటర్లను 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి బూత్ లెవెల్ అధికారి దగ్గర తప్పనిసరిగా అన్ని రకాలైన ఎలక్షన్ కు సంబంధించిన ఫారములు 6,7,8, తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించినప్పుడు బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు. ఓటర్ల నమోదుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాల నిర్వహణ ద్వారా 100% ఓటర్లను నమోదు చేయవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే సుబ్రహ్మణ్యం, ఎంపిడివో గరగ శివరామకృష్ణయ్య, శంఖవరం మండలంలో బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.